
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 23 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 200 టన్నుల సరుకు వచ్చింది.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.08



న్యూస్‌రీల్

పరిటాల శ్రీరామ్ వర్గీయులకు రిమాండ్

బత్తలపల్లి: బీజేపీ నాయకుడు వరదాపురం సూరీ వర్గీయులు, పరిటాల శ్రీరామ్ వర్గీయుల మధ్య ఈనెల 4న బత్తలపల్లి కూడలిలో చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి శుక్రవారం శ్రీరామ్ వర్గీయులు ఆరుగురికి జడ్జి రిమాండ్ విధించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... ఈ నెల 4వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు పెనుకొండ సమీపంలో బహిరంగ సభను నిర్వహించారు. చంద్రబాబు వద్ద బల ప్రదర్శన చేసేందుకు వరదాపురం సూరి, పరిటాల శ్రీరామ్ పోటాపోటీగా వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బత్తలపల్లిలోని టీడీపీ కార్యాలయం ముందు ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 30 వాహనాలు ధ్వంసంకాగా, పలువురు గాయపడ్డారు. ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అందులో భాగంగా శ్రీరామ్ వర్గీయులు అప్పస్వామి, కిరణ్, మోహన్, నల్లప్ప, కాటమయ్య, నాగరాజులను శుక్రవారం అరెస్టు చేసి ధర్మవరం కోర్టులో హాజర పరిచారు. జడ్జి వారికి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రెమ్యునరేషన్ పెంపుపై హర్షం

పుట్టపర్తి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది రెమ్యునరేషన్‌ను ప్రభుత్వం పెంచింది. దీనిపై వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. చీఫ్ ఎగ్జామినర్ రెమున్యరేషన్ రూ. 240 నుంచి రూ.396, చీఫ్ కోడింగ్ అధికారికి రూ 220 నుంచి రూ 300, అసిస్టెంట్ కోడింగ్ అధికారికి రూ 198 నుంచి రూ 296, అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు పేపర్‌కు రూ 6.60 నుండి రూ.10 చొప్పున ప్రభుత్వం రెమున్యరేషన్ పెంచింది. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, జంషీద్, నాటిల్ రవీందర్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

తనిఖీలు ముమ్మరం



బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: ఎన్నికల వేళ పోలీసులు అప్రమత్తమయ్యారు.జిల్లాలోని ప్రధాన చెక్ పోస్టులతో పాటు ప్రధాన కూడళ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో తనిఖీలు ముమ్మరం చేశారు. అలాగే ప్రధాన రహదారిపై బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలను నిలిపి సోదాలు చేస్తున్నారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్నీ తనిఖీలు చేస్తున్నారు. ఆధారాలు లేకుండా నగదు, ఆభరణాలు దొరికితే సీజ్ చేస్తున్నారు.

టీడీపీ నాయకులపై ఫిర్యాదు

సోమందేపల్లి: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన సోమందేపల్లి మండల టీడీపీ నాయకులపై ఎంసీసీ అధికారి వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా స్థానిక సప్తగిరి కాలనీ సమీపంలో హిందూపురం–పెనుకొండ ప్రధాన రహదారిపై శుక్రవారం టీడీపీ నేతలు బాణసంచా పేలుస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు. దీంతో ఎంసీసీ అధికారి ఎస్‌ఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

‘పురం’లో బీజేపీకి ఝలక్

చంద్రబాబు మార్క్ రాజకీయం

- హిందూపురం ఎంపీ అభ్యర్థిగా బీకే పార్థసారథి ఖరారు
- పరిపూర్ణానందస్వామికి అవమానం
- అంబికా లక్ష్మీనారాయణ, నిమ్మల కిష్టప్ప ఆశలు ఆవిరి
- ధర్మవరం సీటుపై బీజేపీ ఆశలు.. రేసులో వరదాపురం సూరి

చంద్రబాబు రాజకీయ చదరంగంలో సొంత పార్టీ నేతలే పావులుగా మారుతున్నారు. పార్టీ కోసం దశాబ్దాలుగా జెండాలు మోసిన వారంతా ఎందుకూ పనికిరాకుండా పోయారు. బీజేపీ, జనసేనతో పొత్తును సాకుగా చూపి నమ్మిన బీసీ నేతలను చంద్రబాబు నట్టేట ముంచారు. జిల్లాలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు ఇందుకు అద్దం పడుతున్నాయి.



సాక్షి, పుట్టపర్తి

టీడీపీ అభ్యర్థుల మూడో జాబితా విడుదలతో సొంత పార్టీతో పాటు మిత్రపక్షాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. జిల్లాలోని హిందూపురం పార్లమెంటు అభ్యర్థిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేరు ఖరారు చేశారు. దీంతో ఎంపీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేతలు నిమ్మల కిష్టప్ప, అంబికా లక్ష్మీనారాయణ ఆశలు ఆవిరయ్యాయి. ఇన్నాళ్లూ టికెట్‌పై ఊరించిన చంద్రబాబు, లోకేశ్ తీరుపై వారిద్దరూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు హిందూపురం ఎంపీ టికెట్ తనదేనని రెండు నెలలుగా ప్రచారం చేసిన బీజేపీ నేత పరిపూర్ణానందస్వామి దుకాణం సర్దేయాల్సిన పరిస్థితి తలెత్తింది. హిందూపురం పార్లమెంటు నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తానని ప్రచారం చేసుకున్న పరిపూర్ణానంద... పెనుకొండలోనే మకాం వేశారు. పార్టీ కార్యాలయం, నివాసం ఏర్పాటు చేసుకుని నిత్యం సమావేశాలు నిర్వహించారు. అయితే జాబితాలో ఎంపీ సీటు టీడీపీ ఖరారు కావడంతో పరిపూర్ణానంద దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇన్నాళ్లూ హిందూపురం ఎంపీగా తానే పోటీచేస్తానని ప్రజలకు చెప్పిన ఆయనకు ఇప్పుడు తల తీసేసినట్టయ్యింది. ఇక మిత్రపక్షమైన జనసేనకూ ఒక్కటంటే ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరుపార్టీల్లో గందరగోళం..

బీకే పార్థసారథికి హిందూపురం ఎంపీ సీటు ఖరారు చేయడంతో అంబికా లక్ష్మీనారాయణ, నిమ్మల కిష్టప్ప అలకబూనినట్లు తెలిసింది. బీకే పార్థ గెలుపునకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించకూడదనే నిర్ణయానికి వారిద్దరూ వచ్చినట్లు సమాచారం. మరోవైపు ఇన్నాళ్లూ టికెట్ ఆశ చూపి.. ఉన్నఫళంగా నిర్ణయం మార్చిన చంద్రబాబు తీరుపై బీజేపీ నేతలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. కూటమి ఏర్పాటయ్యే ముందు మాట ఇచ్చి.. తర్వాత తనకు అనుకూలంగా ఉన్న వారి కోసం బీజేపీ – జనసేనను బలి చేస్తున్నారని మండిపడుతున్నారు. అంతేకాకుండా టీడీపీ మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతారనే ప్రచారం కూడా సాగుతోంది.

తేలని ధర్మవరం పంచాయితీ..

హిందూపురం పార్లమెంటు పరిధిలో ఖాళీగా ఉన్న ధర్మవరం సీటు హాట్ టాపిక్‌గా మారింది. మూడో జాబితాలో కూడా పేరు లేకపోవడంతో మరింత టెన్షన్ పుట్టిస్తోంది. ఇక్కడ ఓ వైపు పరిటాల శ్రీరామ్, మరోవైపు వరదాపురం సూరి (గోనుగుంట్ల సూర్యనారాయణ) కొంతకాలంగా ఆధిపత్య పోరు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో హిందూపురం ఎంపీ సీటు టీడీపీకి కేటాయించడంతో ధర్మవరం సీటు బీజేపీకి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆపార్టీ నేతలు చెబుతున్నారు.

బలి పశువు బీకే..

తమది బీసీల పార్టీ అని చెప్పుకొనే చంద్రబాబు ఓడిపోయే సీట్లను వెనుకబడిన వర్గాలకు కేటాయిస్తున్నారనే చర్చ జరుగుతోంది. హిందూపురం ఎంపీ సీటు బీజేపీకి ఇస్తామని టీడీపీ పెద్దలు ఇన్నాళ్లూ ప్రచారం చేశారు. తీరా బీకే పార్థసారథికి ఇవ్వడంతో బీజేపీ నేతలంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆశపెట్టి మోసం చేసిన టీడీపీకి సహకరించలేమంటున్నారు. మరోవైపు టికెట్ ఆశించి భంగపడ్డ టీడీపీ నేతలు అంబికా లక్ష్మీనారాయణ, నిమ్మల కిష్టప్ప కూడా బీకేకు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. బీజేపీతో పొత్తు కారణంగా క్రిస్టియన్లు, ముస్లిం మైనార్టీలు బీకే పార్థసారథికి ఓటు వేసే పరిస్థితి ఉండదు. జిల్లాలో ఒక్క సీటు కూడా కేటాయించలేదన్న కోపంతో జనసేన కార్యకర్తలూ దూరంగానే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో బీకే ఓటమి ఖాయమని, అలాంటి సీటు బీకేకు ఇవ్వడం ఏమిటని అనుచరులు వాపోతున్నారు.

ఒక్కదెబ్బకు రెండు పిట్టలు..

ధర్మవరం సీటు విషయంలో చంద్రబాబు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. పొత్తు పేరు చెప్పి శ్రీరామ్‌ను ఇంటికి పంపడం .. అదే పొత్తు పేరుతో తన అనుయాయుడు వరదాపురం సూరికి టికెట్ కేటాయించేందుకు ప్లాన్ వేసినట్లు టీడీపీ నేతలే చెబుతున్నారు. పరిటాల శ్రీరామ్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత వచ్చిన మున్సిపల్, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ధర్మవరంలో టీడీపీ కనీసం ఖాతా కూడా తెరవలేకపోయింది. ఇందుకు టీడీపీ అధిష్టానం పరిటాల శ్రీరామ్‌ను బాధ్యున్ని చేసింది. గట్టిగా అడిగితే దీన్నే కారణంగా చంద్రబాబు చూపించనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అదే జరిగితే పరిటాల శ్రీరామ్ ఇంటికి పరిమితం కావాల్సిందేనంటూ సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేస్తున్నారు. తనకు టికెట్ రాకుంటే రాజకీయ సన్యాసం చేస్తానన్న పరిటాల శ్రీరామ్ గతంలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ప్రస్తుతం హల్‌చల్ చేస్తున్నాయి.

సిద్ధయ్యా.. ఇదేందయ్యా!

- బీకే పార్థసారథి సేవలో తరిస్తున్న ఉపాధ్యాయుడు



బీకే పార్థసారథికి ఎంపీ టికెట్ వచ్చిందన్న ఆనందంతో స్వీట్ తినిపిస్తున్న టీచర్ సిద్ధయ్య

పెనుకొండ: టీచరుగా విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు రాజకీయ పాఠాలు నేర్చుకుంటున్నాడు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ నేతలకు సేవలు చేస్తూ గడిపేస్తున్నాడు. అతను పాఠశాలకు వెళ్లకపోయినా విద్యాశాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

రాజకీయం వదల్లేక...

పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన దూదేకుల సిద్ధయ్య పెనుకొండ మండల టీడీపీ కన్వీనర్‌గా పనిచేసేవారు. ఏడాది క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 1998 డీఎస్సీ కోటాలో క్వాలిఫైడ్ అభ్యర్థులకు టీచర్ ఉద్యోగాలు కల్పించారు. ఈ క్రమంలో సిద్ధయ్యకు కూడా ఉద్యోగం దక్కింది. అధికారులు ఆయనకు రొద్దం మండలం కంచిసముద్రం ప్రాథమిక పాఠశాలకు పోస్టింగ్ ఇచ్చారు. అయితే పాతవాసనలు వదులుకోని సిద్ధయ్య పాఠశాలకు దుమ్మా కొట్టి ఖద్దరు చొక్కా తొడుక్కుని టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి సేవలో తరించేవారు. దీంతో రొద్దం ఎంఈఓ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలపగా, సిద్ధయ్యను మడకశిర మండలం ఎగువరామగిరి ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేశారు. కానీ సిద్ధయ్య అక్కడా అదే తంతు. దీంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫిర్యాదు చేసినా విద్యాశాఖ అధికారులు సిద్ధయ్యపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా మడకశిరకు దగ్గరగా ఉన్న ఆర్.అనంతపురం ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేశారు. కానీ సిద్ధయ్య నేటికీ ఆ పాఠశాలకు వెళ్లడం లేదు. సార్వత్రిక ఎన్నికలు సమీపించిన తరుణంలో పెనుకొండ టీడీపీ బాధ్యతలన్నీ భుజాన వేసుకుని పనిచేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు మాత్రం అలా చూస్తూ ఉండిపోతున్నారు. ఇప్పటికైనా దారితప్పిన సదరు టీచరుకు బుద్ధి చెప్పాలని పలువురు కోరుతున్నారు.

గుండుమల.. గుండుసున్నా!

- ఎంపీ సీటూ చేజారిపాయె
- మడకశిర టికెట్ విషయంలోనూ పట్టించుకోని టీడీపీ హైకమాండ్
- చంద్రబాబు తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న గుండుమల
- భవిష్యత్ కార్యాచరణపై అనుచరులతో రేపు సమావేశం

మడకశిర: మాజీ ఎమ్మెల్సీ, మడకశిర టీడీపీ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. ఎస్సీ రిజర్వుడు స్థానమైన మడకశిరలో ఉన్న గుండుమల తిప్పేస్వామికి ఈ సారి హిందూపురం ఎంపీ సీటు ఇస్తామంటూ ఇన్నాళ్లూ చంద్రబాబు ఆశ పెట్టారు. కానీ మడకశిర సీటు విషయంలో గుండమల అభిప్రాయాన్ని ఏ మాత్రం పట్టించుకోని చంద్రబాబు...తాజాగా ఎంపీ సీటు విషయంలోనూ కనీసం పేరు కూడా పరిశీలించలేదు. దీంతో గుండమల వర్గమంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

వాడుకుని వదిలేశారు..

2019 ఎన్నికల్లో మడకశిర నుంచి టీడీపీ అభ్యర్థిగా ఈరన్న పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఈరన్నకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో టీడీపీ అధిష్టానం ఈరన్నను ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించి గుండుమల తిప్పేస్వామికి అప్పగించింది. దాదాపు రెండేళ్ల పాటు గుండుమల తిప్పేస్వామి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఇన్నాళ్లూ అయన్ను వాడుకున్న టీడీపీ పెద్దలు టికెట్ విషయంలో మాత్రం కనీసం అభిప్రాయం అడగలేదు. పైగా అగ్గిమీద గుగ్గిలంలా గుండమల తీవ్రంగా వ్యతిరేకించే ఈరన్న కుమారుడు సునీల్‌కు సీటు ఖరారు చేసింది. దీనిపై గుండుమల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సునీల్‌ను మార్చాలని గుండుమల డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు అనుచరులతో నిరసన కార్యక్రమాలు చేయించారు. దీంతో పార్టీలోని కొందరు పెద్దలు హిందూపురం ఎంపీ సీటు ఆశజూపుతూ గుండమలను సముదాయించారు. దీంతో ఆయన కూడా తాను హిందూపురం ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తున్నానంటూ అందరితో చెప్పుకున్నారు. కానీ తాజాగా ఎంపీ స్థానం బీకే పార్థసారథికి ఖరారు చేయడంతో గుండుమల రాజకీయ భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఈ పరిస్థితుల్లో గుండుమల తిప్పేస్వామి తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకుంది. టీడీపీలోనే కొనసాగుతారా? లేదా? అనే విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



గుండుమల తిప్పేస్వామి

రేపు అనుచరులతో సమావేశం

తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి ఆదివారం నియోజకవర్గంలోని తన అనుచరులతో సమావేశాన్ని ఏర్పాటు ఏర్పాటు చేశారు. పట్టణంలోని యాదవ కల్యాణ మంటపంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో పాల్గొనాలని నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలకు కబురు పంపారు. ఈ సమావేశంలో తన రాజకీయ భవిష్యత్‌పై చర్చించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు నమ్మించి మోసం చేశారంటూ గుండుమల వర్గీయులు ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గుండుమల టీడీపీలోనే కొనసాగాలా? లేదా పార్టీ మారాలా? అనే విషయంపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా చేసే ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీ అన్ని రకాల మీడియా ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇస్తుందన్నారు. పెయిడ్ న్యూస్‌ను పర్యవేక్షిస్తుందని, ఉల్లంఘనలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. అభ్యర్థులు ముందస్తు అనుమతి కోసం నిర్ణీత నమూనాలో మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రిజిష్టర్ కాని రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు ప్రకటన ప్రసారం చేయడానికి 7 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు పత్రికల్లో ఇచ్చే ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్ వర్క్, డిజిటల్ డిస్ ప్లే, మొబైల్ నెట్ వర్కల ద్వారా ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, దీంతో పాటు ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాలూ ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయన్నారు. సినిమా హాళ్లు, ఎఫ్ఎం రేడియో తదితర వాటిల్లో ప్రకటనలు ఇచ్చేందుకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎంసీఎంసీ అనుమతి లేని వాటిని ఉల్లంఘనల కింద పరిగణించి తగిన చర్యలకు ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు.

మీడియా ప్రతినిధులకూ పోస్టల్ బ్యాలెట్

పుట్టపర్తి అర్బన్: కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యవసర సేవలందించే 33 శాఖల ఉద్యోగులతో పాటు ఎన్నికల విధుల్లో ఉంటే మీడియా ప్రతినిధులకూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం ఎలక్ట్రానిక్ సీజర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం వినియోగంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా (సీఈఓ) అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును సమీక్షించారు. వస్తువులను సీజ్ చేసే అంశంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా పరిధిలోనే కాకుండా సరిహద్దుల్లోనూ నిఘా పటిష్టం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు జిల్లాలోని ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్టు వద్ద కెమెరాతో పరిశీలన బృందాన్ని ఉంచాలన్నారు. ఏదైనా ఘటన చోటు చేసుకుంటే వెంటనే వాస్తవ నివేదికను పంపాలన్నారు. ఓటరు జాబితా పెండింగ్ క్లెయింలన్నీ ఈనెల 26వ తేదీలోపు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, వెంకట శివ రామిరెడ్డి తదితరులు ఉన్నారు.



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్‌కుమార్

గణితం పరీక్ష ప్రశాంతం



లేపాక్షిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న మహేష్

పుట్టపర్తి: పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 115 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 24,285 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1,385 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఈఓ..

హిందూపురం టౌన్: స్థానిక నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని డీఈఓ మీనాక్షి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రానికి కేటాయించిన విద్యార్థుల సంఖ్య, గైర్హాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్షా కేంద్రంలో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్దను డీఈఓ పరిశీలించారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూకు అనుగుణంగా విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

లేపాక్షి/హిందూపురం: లేపాక్షి మండలంలోని మహాత్మాజ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి మహేష్ శుక్రవారం పరిశీలించారు. మండలంలో ఎన్ని పరీక్షా కేంద్రాలు ఉన్నాయి? మౌలిక సదుపాయాలు అన్నీ పక్కాగా ఏర్పాటు చేశారా? అని అడిగి తెలుసుకున్నారు. అలాగే నాయనిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలుర విద్యాలయాన్ని, హిందూపురం కొటిపి రోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ ఏపీ గురుకులం పాఠశాలను పరిశీలించారు. డార్మెటరీ, తాగునీరు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలుంటే చెప్పాలని కోరారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త డీసీఓ మురళీకృష్ణతో పాటు ప్రిన్సిపాల్ మధుసుధన్‌రావు ఆయన వెంట ఉన్నారు.

సింహ వాహనంపై నారసింహుడు



సింహవాహనంపై లక్ష్మీనరసింహుడు



సింహ వాహనంపై తిరువీధుల్లో దర్శనమిస్తున్న శ్రీవారు



వాహనం ముందు తమిళనాడుకు చెందిన డోలు,నాదస్వర బృందం

- వైభవంగా కొనసాగుతున్న ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలివస్తున్న భక్త జనం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో నాల్గో రోజైన శుక్రవారం స్వామి వారు సింహ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ అర్చకులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహం శౌర్యానికి, గాంభీర్యానికి, పరాక్రమానికి ప్రతీక. తనకు ప్రీతిపాత్రమైన ఈ సింహ రూపంలోనే స్వామివారు నరసింహ అవతారమెత్తి హిరణ్యకశ్యపుని సంహరించారు. ఎప్పటిలాగే తమిళనాడు రాష్ట్రానికి చెందిన నాదస్వరం, డోలు విద్వాంసులు స్వామివారు తిరువీధుల్లో ఊరేగుతుంటే వాహనం ముందు భక్తితో పాటు తమ కళను చాటుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సింహవాహన సేవ ఉభయదారులుగా బెంగళూరుకు చెందిన నిరంజన్, కదిరికి చెందిన మాడిశెట్టి నరసయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

నేడు హనుమంత వాహనం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఖాద్రీశుడు హనుమంత వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఒకటైన రామావతారంలో రాక్షస సంహారం అనంతరం రామలక్ష్మణులను హనుమంతుడు తన భుజస్కందాలపై ఎత్తుకొని భక్తిని చాటుకున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. నరసింహావతారంలో కూడా హిరణ్యకశ్యపుని సంహారం అనంతరం శ్రీ మహావిష్ణువును హనుమంతుడే సాక్షాత్తు తన భుజస్కందాలపై మోస్తాడని భక్తుల నమ్మకం.

క్లుప్తంగా

కవితల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్, దళిత బహుజన తత్వంపై కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ. 2 వేలు నగదు అందిస్తామన్నారు. కవితలు పంపేవారు వచ్చే నెల 5వ తేదీలోగా పంపాలన్నారు. కవితలను డాక్టర్ శివన్న, ప్రధాన కార్యదర్శి, 9440805955 వాట్సాప్‌కు పంపాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతుడు సీతారామ్

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి చనిపోయాడు. పోలీసుల వివరాలమేరకు... మహారాష్ట్ర రాష్ట్రం రాయగఢ్‌కు చెందిన సీతారామ్ (37) భార్య, ఇద్దరు పిల్లలతో కదిరిలో నివాసం ఉంటున్నారు. కదిరి సరిహద్దు ప్రాంతాల్లో ఉండే కంపచెట్లను కాల్చి వచ్చే బొగ్గును అమ్ముకుంటూ సీతారామ్ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలోనే సీతారామ్ కదిరి నుంచి ముదిగుబ్బకు బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అయితే కదిరి నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కాళసముద్రం వద్ద అటుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీ కొంది. దీంతో సీతారామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కదిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఫిబ్రవరిలో నిర్వహించిన బీ ఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీ ఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-15) సప్లిమెంటరీ, బీ ఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-19), (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఫలితాలు జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

భగ్గుమంటున్న బంగారం ధర

- అదే బాటలో వెండి
- 10 గ్రాముల బంగారం రూ.67 వేలు, కిలో వెండి రూ.77 వేలు
- గోల్డ్ రేట్లపై ప్రభావం చూపుతున్న క్రూడాయిల్ ధర, ఎన్నికలు
- పెళ్లిళ్ల సీజన్‌లోనూ సగానికి పడిపోయిన అమ్మకాలు



హిందూపురం అర్బన్: బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. ప్రతిరోజూ ధరలు పెరుగుతుండటంతో కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారు. స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములు రూ. 67 వేలకు చేరువవుతోంది. వెండి సైతం అదేబాటలో కిలో రూ.77 వేలు పలుకుతోంది.

క్రూడాయిల్ ధర పెరుగుదలతో...

అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు అంతకంతకూ పెరుగుతుండటం కూడా బంగారం ధర పెరగడానికి కారణమవుతోంది. దీంతో స్థానికంగా వ్యాపారులు సైతం పెంచక తప్పని పరిస్థితి. ప్రస్తుతం బంగారం ధరలు ఆల్‌టైం హైలో కొనసాగుతున్నాయి. స్థానికంగా 10 గ్రాములు 916 (కేడీఎం)స్వచ్ఛత గల బంగారం ధర రూ.67 వేలు పలుకుతోంది. వెండి కిలో రూ.74 వేల నుంచి 75 వేలు అమ్ముతున్నారు. పెళ్లిళ్ల సీజన్ తరువాత తగ్గుతాయని బులియన్ వర్గాలు విశ్లేషిస్తూ వచ్చాయి. అయితే వారి అంచనాలు తలకిందులు చేస్తూ ఇప్పుడు బంగారం ధరలు కొండెక్కి కూర్చున్నాయి. మరోవైపు వెండి ధరలు కూడా పెరుగుతున్నాయి. ముంబాయ్ మార్కెట్ ధర్పై హిందూపురం మార్కెట్ నడుస్తోంది. శుక్రవారం హిందూపురం, మడకశిర, కదిరి మార్కెట్‌లో బంగారం 10 గ్రాములు రూ.67 వేలు, వెండి రూ. 74 వేలు అమ్మకం చేస్తున్నారు. ఆభరణాల బంగారం 22 క్యారెట్లది 10 గ్రాములు రూ.62,400తో విక్రయాలు జరుపుతున్నారు.

పెళ్లిళ్ల సీజన్ అయినా ...

సాధారణంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోళ్లు ఎక్కువగా ఉంటాయి. అయితే అంతకంతకూ గోల్డ్ రేట్లు పెరుగుతుండటంతో ఈసారి పెళ్లిళ్ల సీజన్ వచ్చినా బంగారం కొనుగోళ్లు తక్కువగా ఉన్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిత్యం రూ.10 కోట్ల లావాదేవీలు జరుగుతుండగా అవి సగానికి తగ్గాయి. మరోవైపు పాత బంగారం మార్పిడికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న వ్యాపారాల్లో 30 శాతం పాత బంగారం మార్పిడితోనే జరుగుతోంది.

అడుగడుగునా తనిఖీలు..

సార్వత్రిక ఎన్నికల వేళ అడుగడుగునా పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నగదును నగరాలకు తీసుకెళ్లడం, బంగారం కొనుగోలు చేసినా తీసుకురావడం కష్టంగా మారింది. దీంతో దుకాణాల్లో ఉన్న సరకు అమ్మకాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. బంగారాన్ని బస్సులు, రైళ్లలో తీసుకురావడం కష్టంగా మారిందంటున్నారు. ఎన్నికలు ముగిసే వరకు కొనుగోళ్ల జోలికి వెళ్లబోమని చెబుతున్నారు.

నెల రోజులుగా 24 క్యారెట్ల బంగారం, వెండి ధరల పెరుగుదల ఇలా..

తేదీ	బంగారం (10 గ్రాములు)	వెండి (కిలో)
10.02.2024	64,200	72,000
15.02.2024	64,300	72,500
22.02.2024	64,500	72,750
03.03.2024	65,000	74,000
22.03.2024	66,450	77,000

గోల్డ్ ధరలు తగ్గే పరిస్థితి లేదు



ఎన్నికల వేళ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఆ ప్రభావం బంగారు రవాణా రంగంపై పడుతోంది. ఎన్నికలు ముగిసే వరకు నగదు తరలింపు సైతం కష్టమే. ఈ ధరలు ఎన్నికలు ముగిసే వరకు కొనసాగవచ్చు. బంగారం ధరలు పెరుగుతాయే కాని తగ్గే పరిస్థితి కనిపించడం లేదు.

– నంబూరి శంకర్, స్టేట్ బులియన్ సిల్వర్, డైమండ్ మర్చెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు

ధరలు పెరిగితే కొనేదెలా?



బంగారం ధరలు నెల రోజుల్లోనే అమాంతం పెరిగాయి. మార్కెట్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.62000 చేరింది. ఇక 24 క్యారెట్ల రూ.67000లకు చేరింది. అత్యవసరమని బంగారం షాపుకెళ్లాము. 30 గ్రాములు కొనేందుకు వెళ్లి పెరిగిన ధర కారణంగా 20 గ్రాములు కొనాల్సి వచ్చింది. బంగారం కొనలేని వస్తువుగా మారుతోంది.

– కవిత, గృహిణి, చిలమత్తూరు

ఎప్పుడు కొందామన్నా ఇంతే..



బంగారం అంతకంతకూ పెరుగుతోంది. వ్యాపారులు మాత్రం ఎన్నికల సమయంలో రెండు నెలల పాటు సరకు తీసుకురావడం, నగదు తీసుకెళ్లడం కష్టమంటున్నారు. మార్కెట్‌లో 22 క్యారెట్లు రూ.62000లకు చేరుకుంది. ఎప్పుడూ కొందామన్నా బంగారం రేట్లు పెరుగుతున్నాయే తప్ప తగ్గే పరిస్థితే కనిపించడం లేదు. దీంతో గోల్డ్ కొనలేకపోతున్నాం.

– ఇందిర, గృహిణి, కొడికొండ

తాగునీటి ఎద్దడి నివారణకు నిధులివ్వండి

- సీఎస్‌ను కోరిన కలెక్టర్ అరుణ్‌బాబు


మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన నిధులను విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని కలెక్టర్ అరుణ్‌బాబు కోరారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ తాగునీటి పథకాలన్నీ సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నుంచి కనీసం రోజుకు ఒకసారైనా నీటిని విడుదల చేసేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటనారాయణ తదితరులతో కలిసి మాట్లాడారు. తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి ఎద్దడి నివారణకు సుమారు రూ 8 కోట్లు అవసరమవుతాయని, వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కరువు మండలాల్లో 1368 నీటి ఎద్దడి ఆవాసాలు ఉన్నాయని గుర్తించామని, యుద్ధ ప్రాతిపదికన తాగునీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉపాధి పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 2.46 లక్షల మంది కూలీలకు రూ.165.30 కోట్ల వేతనం చెల్లించి 72.29 లక్షల పని దినాలను కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పశుసంవర్ధకశాఖ అధికారి శుభదాస్, తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

హిందూపురం టౌన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని బాలంపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో మౌలిక వసతులను తనిఖీ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన వారు ఫారం-6 దరఖాస్తును ఉపయోగించి ఓటు హక్కును పొందాలని అన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి బూత్‌స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.

రూ. 5 లక్షల నగదు పట్టివేత

కదిరి టౌన్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని కొత్త బ్రిడ్జి వద్ద పట్టణ పోలీసులు శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగానే ఓడీసీ నుంచి నుంచి కదిరికి కారులో తరలిస్తున్న రూ.5,35,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బాబ్జాన్ తెలిపారు. ఓడీసీకి చెందిన గుణశేఖర్ విచారణ చేయగా... మార్గదర్శి చిట్‌ఫండ్‌లో కట్టేందుకు తీసుకొస్తున్నట్లు చెప్పారన్నారు. డబ్బును ఆర్‌ఓకు అప్పగించామన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గోవా మద్యాన్ని చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

తాడిమర్రి: గోవా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 24 బాక్స్‌ల మద్యం బాటిళ్లను శుక్రవారం తాడిమర్రి పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు.. ముదిగుబ్బ రూరల్ సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్‌ఐ నాగస్వామితో కలసి శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ధర్మవరం పట్టణం కేతిరెడ్డి కాలనీకి చెందిన కే.షాహిద్‌ఖాన్ ఈనెల 12న తాడిపత్రి పట్టణంలో రూ.11 లక్షలకు ఒక లారీ కొనుగోలు చేశాడు. అనంతరం తాడిపత్రి పట్టణం టైలర్స్ కాలనీలో నివాసం ఉంటున్న శింగనమల మండలం కొరివిపల్లికి చెందిన దూదేకుల కుళ్లాయప్పను డ్రైవర్‌గా పెట్టుకుని గోవాకు వెళ్లారు. అక్కడ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్‌కు మద్యం సప్లయ్ చేసే బ్లాక్ అనే యాప్‌ను ఓపెన్ చేసి అందులో డ్రైవింగ్ లైసెన్స్, లారీ ఆర్సీ, ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు అప్‌లోడ్ చేశారు. దీంతో అక్కడ జెమినీ అనే డిస్టరీల్లో 850 కేసుల మద్యాన్ని అధికారికంగా లోడ్ చేసుకున్నారు. ఆ మద్యాన్ని వారు మదనపల్లి, చిత్తూరు, రేణిగుంటలో దింపాల్సి ఉంది. అయితే తిరుగు ప్రయాణంలో గోవాలోనే 90 బాక్స్‌లను అక్రమంగా లారీ పైభాగంలో వేసుకుని హుబ్లీ, దార్వాడా, గుంతకల్లు, గుత్తి, అనంతపురం మీదుగా బత్తలపల్లికి తీసుకొచ్చారు. బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన మాలపాటి రవితేజకు కొంత భాగాన్ని విక్రయించారు. అనంతరం మిగిలిన మద్యాన్ని యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి అందజేయడానికి వెళ్తుండగా శుక్రవారం దాడితోట సమీపంలోని పుల్లుట్ల కనుమలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దగ్గర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మాన్షన్ హౌస్ ఫుల్ బాటిళ్లు 110, 180 ఎంఎల్ బాటిళ్లు 720 మొత్తం రూ.1.50 లక్షలు విలువచేసే మద్యాన్ని పట్టుకున్నారు. కే.షాహిద్ ఖాన్, దూదేకుల కుళ్లాయప్ప, తిమ్మంపల్లికి చెందిన లోచర్ల హరికృష్ణ, నీరుగంటి నాగరాజు, సుందు సురేష్, ధర్మవరం పట్టణానికి చెందిన కోటం దేవానంద్, ఏటూరు రవికుమార్, మర్రిమాకులపల్లికి చెందిన కమ్మ నరేష్‌లను అరెస్టు చేశారు. మద్యం బాక్స్‌లను, లారీని పోలీసుస్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి ధర్మవరం కోర్టుకు హాజరు పర్చినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అక్రమ మద్యాన్ని పట్టుకున్న ఎస్‌ఐ నాగస్వామిని, సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

లేపాక్షిలో...

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ఒక మహిళ వద్ద శుక్రవారం 48 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపీ తెలిపారు. తమకు రాబడిన సమాచారం మేరకు మహిళ కర్ణాటక మద్యం అమ్ముతుండగా దాడులు నిర్వహించి ఆమెను అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

72 మద్యం ప్యాకెట్లు...


హిందూపురం అర్బన్: కర్ణాటక రాష్ట్రం నుంచి చర్లపల్లి మీదుగా అక్రమంగా తరలిస్తున్న 72 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ కమలాకర్ వాహనాల తనిఖీ చేస్తుండగా లేపాక్షి మండలం మద్దిపికి చెందిన రాజశేఖర్, చర్లపల్లికి చెందిన ఓ మహిళ ద్విచక్ర వాహనంలో మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

తూమకుంట చెక్‌పోస్టు వద్ద 288...

హిందూపురం మండలం తూమకుంట చెక్‌పోస్టు వద్ద శుక్రవారం 288 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటకలోని గౌరిబిదనూరు ప్రాంతం నుంచి ద్విచక్ర వాహనంలో హిందూపురానికి మద్యాన్ని తీసుకొస్తుండగా పట్టుకున్నామన్నారు. దేవరపల్లికి చెందిన పవన్‌కుమార్, సంజీవరాయప్పలపై కేసు నమోదు చేశామన్నారు.

'రిలయన్స్'లో దోపిడీకి కుట్ర

- ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన 'అనంత' పోలీసులు
- నిందితుల్లో ఇద్దరు పాత నేరస్తులే


స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు పరిశీలిస్తున్న అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రిలయన్స్ మార్ట్‌లో దోపిడీ చేసేందుకు పన్నిన కుట్ర భగ్నమైంది. ముగ్గురు సభ్యులుగా ఉన్న ముఠాను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి మూడు వేట కొడవళ్లు, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు.

మార్ట్‌తో పాటు వర్తకుడి ఇల్లు లూటీకి కుట్ర..

అనంతపురం నగరంలోని రిలయన్స్ మార్ట్‌తో పాటు హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న ఓ వర్తకుడి ఇంటిని లూటీ చేసేందుకు కుట్ర పన్నిన ముఠా సభ్యులు ముందుగా రెక్కీ నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ముఠా సభ్యుల కదలికలపై అనుమానం వచ్చిన ఎస్పీ అన్బురాజన్ వెంటనే డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డిని అప్రమత్తం చేశారు. ఆయన నేతృత్వంలో రంగంలో దిగిన అనంతపురం వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం ఉదయం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద వెళుతున్న ఆటోను అడ్డుకుని పరిశీలించారు. అందులో మూడు వేట కొడవళ్లు, ఐరన్‌రాడ్ లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని, అందులో ప్రయాణిస్తున్న గుజ్జల రుశ్యింగులు, రాగిరి శ్రీనివాసులు, గొల్ల చంటిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో రిలయన్స్ మార్ట్ దోపిడీతో పాటు వర్తకుడి ఇల్లు లూటీకి కుట్ర విషయం వెలుగు చూసింది. నిందితులను అరెస్ట్ చేసి, ఆటోను సీజ్ చేశారు.

పథకం రూపొందించుకుని...

తొలుత గుజరీ, సిల్వర్ సామాన్ల వ్యాపారం చేసే రుశ్యింగులు అందులో నష్టం రావడంతో రూ.7 లక్షల మేర అప్పుల పాలయ్యాడు. ఆ అప్పులు తీర్చుకునేందుకు రిలయన్స్ మార్ట్‌లో పనిచేస్తున్న తనకు దూరపు బంధువైన రాగిరి శ్రీనివాసులు, గొల్ల చంటిని సంప్రదించాడు. ఈ క్రమంలో రిలయన్స్‌లో రోజు వారీ వ్యాపారంలో భాగంగా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు వస్తుంటుందని, ఈ మొత్తాన్ని ప్రతి రోజూ మేనేజర్ తీసుకెళ్లి బ్యాంక్‌లో జమ చేస్తుంటాడని శ్రీనివాసులు వివరించాడు. దీంతో మేనేజర్‌ను అడ్డగించి ఆ నగదు అపహరించుకెళ్లాలని ముగ్గురూ కలసి పథకం రచించారు. తాము రూపొందించుకున్న పథకం మేరకు శుక్రవారం ఉదయం హౌసింగ్ బోర్డు వైపుగా ఆటోలో వెళుతుండగా వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, సిబ్బంది గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్య సాధనపై సంతృప్తి


మార్కెటింగ్‌శాఖ పురోగతిపై సమీక్షిస్తున్న ఆర్జేడీ రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది మార్కెటింగ్ శాఖ నిర్దేశించుకున్న లక్ష్య సాధనపై ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన మార్కెట్ కమిటీలు నెలాఖరులోపు వంద శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. లక్ష్య సాధనలో పురోగతిపై స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణ చౌదరి, ఎంఎల్ఎన్ మూర్తితో కలసి మార్కెట్‌యార్డుల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో శుక్రవారం ఆయన సమీక్షించారు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని 8 మార్కెట్‌కమిటీలకు ఈ ఏడాది రూ.4.72 కోట్లు లక్ష్యం ఇవ్వగా ప్రస్తుతానికి 96 శాతంతో రూ.4.50 కోట్లకు పైగా సాధించినట్లు తెలిపారు. ఇందులో పుట్టపర్తి కమిటీ అత్యధికంగా 154 శాతంతో ముందు వరుసలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. గోరంట్ల, కదిరి కూడా వంద శాతాన్ని అధిగమించినట్లు తెలిపారు. మడకశిర 99 శాతం, ధర్మవరం 91 శాతం, పెనుకొండ 88 శాతం, హిందూపురం 76 శాతం, చివర్లో తనకల్లు కేవలం 54 శాతం వసూళ్లు సాధించినట్లు తెలిపారు. ఇంకా 10 రోజుల పాటు గడువున్నందున అన్ని కమిటీలు వంద శాతం మార్క్‌ను చేరుకునేలా విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఫేసియల్ అటెండెన్స్ పాటించాలన్నారు. అలాగే ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అనుసరించాలన్నారు.

డెఫ్ ఐపీఎల్‌కు అనంత క్రీడాకారుడు


చాకలి గంగాధర్

పుట్టపర్తి అర్బన్: జమ్మూకాశ్మీర్ వేదికగా ఏప్రిల్ 16 నుంచి 19వ తేదీ వరకూ జరిగే డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐడీపీఎ టీ-20) క్రికెట్ పోటీలకు రాప్తాడు మండలం చిన్మయనగర్‌కు చెందిన చాకలి గంగాధర్ ఎంపికయ్యాడు. ఇటీవల చేపట్టిన ఎంపిక పోటీల్లో బౌలింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. 8 రాష్ట్రాల జట్లు తలపడే ఈ టోర్నీలో ప్రాతినిథ్యం వహిస్తున్న ఏపీ జట్టులో గంగాధర్‌కు చోటు దక్కడంపై బధిరుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


సొంతగూటికి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్

- ఎమ్మెల్యే బాలకృష్ణ మోసం చేశారని ఆవేదన


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి టీఎన్ దీపిక, కౌన్సిలర్ పరుశురాం

హిందూపురం: 'టీడీపీలో చేరితే వార్డు అభివృద్ధికి ఎమ్మెల్యే బాలకృష్ణ కృషిచేస్తారని, అవసరమైతే సొంతనిధులు ఇస్తారని నమ్మించారు. పార్టీలో చేరిన తర్వాత హామీని గాలికి వదిలేశారు' అని 20వ వార్డు కౌన్సిలర్ పరుశురాం ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లాపల్లి బాబురెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలోకి చేరానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరుశురాం మాట్లాడుతూ మాయమాటలతో పార్టీలో చేర్చుకున్నారని, ఆ తర్వాత ఎమ్మెల్యే బాలకృష్ణకు ఫోన్ చేస్తే కనీసం ఫోన్ కూడా తియలేదన్నారు. రాష్ట్ర, నియోజకవర్గ, వార్డు ప్రజలందరూ ఈసారి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. హిందూపురంలో ఎమ్మెల్యేగా కురుబ దీపిక, ఎంపీగా బోయ శాంతమ్మలను గెలిపించుకోవడానికి ఒక సైనికుడిలా పనిచేస్తానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కురుబ దీపిక మాట్లాడుతూ పరుశురాంను మోసం చేసినట్లే ప్రజలందరినీ మోసం చేసేందుకు టీడీపీ గుంపుగా వస్తోందని విమర్శించారు. ప్రజలందరూ వారి కుటిల కుయుక్తులను తిప్పికొట్టాలన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత ఒక్క జగనన్నకు మాత్రమే సాధ్యమైందన్నారు. హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు అందరూ కృషిచేయాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ శివ, నాయకులు నాగరాజు, రామ్మూర్తి, సుభాష్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత


పద్మజకు చెక్ అందిస్తున్న ఏఆర్ డీఎస్పీ విజయకుమార్

పుట్టపర్తి టౌన్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ హరికుమార్ కుటుంబానికి పోలీస్‌శాఖ అండగా నిలిచింది. ఏఆర్ కానిస్టేబుల్ భార్య పద్మజకు పోలీస్ కార్యాలయంలో శాఖాపరంగా రావాల్సిన రూ.1,25,000 చెక్కును ఏఆర్ డీఎస్పీ విజయకుమార్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాఖాపరంగా అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ఏ సమస్య వచ్చిన నేరుగా తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐ చంద్రశేఖర్, రవికుమార్, ట్రెజరర్ షౌకత్‌వలి పాల్గొన్నారు.